క్లుప్తంగా

వైభవంగా ఆది దంపతుల కల్యాణం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):పాతబస్తీలోని భ్రమరాంబ మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం (పాతశివాలయం)లో స్వామి వారి కల్యాణం బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆషాఢ బహుళ చతుర్దశిని పురస్కరించుకొని స్వామి వారి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. భ్రమరాంబ మల్లేశ్వర స్వామి వారి కల్యాణ మహోత్సవం సందర్భంగా విశేషార్చన, పంచహారతులు నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు.

రామలింగేశ్వర స్వామికి పంచామృత అభిషేకాలు



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భీమనవారిపేటలోని శ్రీ విజయదుర్గా రామలింగేశ్వరస్వామి వారి ఆలయంలో స్వామి వారికి బుధవారం పంచామృత అభిషేకాలు నిర్వహించారు. ఆలయంలోని అర్ధనారీశ్వరుడికి ఆలయ అర్చకులు చింతలపాటి వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రి, పవన్ కుమార్ శర్మలు పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం స్వామి వారికి కదంబ పుష్పాలతో అర్చన, పంచ హారతుల సేవ నిర్వహించగా, పలువురు ఉభయదాతలు, భక్తులు పాల్గొన్నారు.

దివ్యాంగుల పింఛను తొలగిస్తే పోరాటానికి సిద్ధం

వైఎస్సార్ సీపీ దివ్యాంగుల సెల్ రాష్ట్ర అధ్యక్షుడు కిరణ్‌రాజ్

భవానీపురం(విజయవాడపశ్చిమ):అర్హులైన దివ్యాంగుల పింఛన్లు తొలగిస్తే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ దివ్యాంగుల విభాగం తరుపున పోరాటానికి సిద్ధమని రాష్ట్ర అధ్యక్షుడు బందెల కిరణ్‌రాజ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వంలో తమకు స్లాట్ దక్కితే అదే పదివేలని దివ్యాంగులు భావిస్తున్నారని తెలిపారు. చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దివ్యాంగులకు ఒక్క నూతన పింఛను మంజూరు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా రీ వెరిఫికేషన్ ప్రక్రియ చేపట్టి సుమారు లక్షా ఎనిమిది వేల పెన్షన్ల తొలగింపునకు శ్రీకారం చుట్టడం దుర్మార్గమని అన్నారు. దివ్యాంగ ధ్రువీకరణ పత్రాల కోసం సదరం స్లాట్ బుకింగ్ ఇచ్చినట్టే ఇచ్చిన ప్రభుత్వం ఆ ప్రక్రియ ద్వారా ఇప్పటి వరకు ఒక్క నూతన సదరం సర్టిఫికెట్ మంజూరు చేసిన దాఖలాలు లేవన్నారు.

ప్రజలను మోసగించటమే బాబు రాజకీయం

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ ఆసిఫ్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):చంద్రబాబునాయుడు గడిచిన తన 15 ఏళ్ల ముఖ్యమంత్రి పాలనలో నిరంతరం ప్రజలకు తప్పుడు వాగ్దానాలిచ్చి మోసం చేయటం అలవాటుగా కొనసాగుతుందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ ఆసిఫ్ అన్నారు. తన కార్యాలయంలో బుధవారం మీడియాతో ఆసిఫ్ మాట్లాడారు. సీనియర్ మంత్రి అచ్చెన్నాయుడు ఆడబిడ్డ నిధి పథకాన్ని అమలు చేయాలంటే రాష్ట్రాన్ని అమ్మాలని చెప్పటం ప్రభుత్వ విధానాన్ని తెలియజేస్తుందన్నారు. చంద్రబాబు 15 ఏళ్ల పాలనలో తన దంటూ ప్రత్యేకంగా చెప్పుకునే ఒక్క పథకం సైతం లేదన్నారు. 2014 ఎన్నికల్లో చంద్రబాబు రైతు రుణమాఫీ, నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ వంటి పథకాలను ప్రకటించి అధికారంలోకి వచ్చారన్నారు. ఆ తరువాత వాటిని ఎగ్గొట్టారని పేర్కొన్నారు. ప్రభుత్వం తన అసమర్థత నుంచి ప్రజలను పక్కదోవ పట్టించేందుకే అక్రమ కేసులు కొనసాగిస్తుందని దుయ్యబట్టారు. ఆ క్రమంలోనే తప్పుడు కేసులతో మిథున్‌రెడ్డిని అరెస్ట్ చేశారన్నారు.

వైభవంగా అమ్మవారికి సారె



భవానీపురం(విజయవాడపశ్చిమ):ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని భవానీ ద్వీపంలోని అమ్మవారి గుడిలో నిర్వహించిన సారె, బోనాల సమర్పణ కార్యక్రమాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ(ఏపీటీడీసీ), భవానీ ఐలాండ్ టూరిజం కార్పొరేషన్ (బీఐటీసీ) సిబ్బంది కలిసి మేళతాళాల నడుమ అమ్మవారికి పసుపు, కుంకుమ, గాజులు, చీరెలు, పండ్లు, పొంగళ్లు తదితర మంగళకర సామగ్రి సమర్పించారు. జగన్మాత కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏపీటీడీసీ చైర్మన్ నూకసాని బాలాజీ, విజయవాడ డివిజనల్ మేనేజర్ పి. కృష్ణచైతన్య, బీఐటీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఉమామహేశ్వరరావు, భవానీ ఐలాండ్, బెరంపార్క్, బీఐటీసీ మేనేజర్లు డీ సుధీర్, కె శ్రీనివాస్, రవీంద్రబాబు పాల్గొన్నారు.

పశ్చిమంలో ఆటోలతో అవస్థలు



లోబ్రిడ్జి వద్ద నిలిపి ఉంచిన ఆటోలు

- ట్రాఫిక్‌కు విఘాతం కలిగిస్తున్న ఆటోవాలాలు
- ప్రధాన కూడళ్లలో అడ్డంగా నాలుగైదు ఆటోలు ఉంచుతున్న డ్రైవర్లు
- రోడ్డుపైనే ఘర్షణలకు దిగుతున్న వైనం
- చోద్యం చూస్తున్న పోలీసులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పశ్చిమ నియోజకవర్గంలో ట్రాఫిక్ చిక్కులు తొలగడం లేదు. అసలే నగరం రద్దీగా మారిన క్రమంలో ఆటోలతో అవస్థలు అన్నీ ఇన్నీ కావు. వాటి సమస్యలు మరింత తలపోటుగా మారాయని స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిత్యం ట్రాఫిక్ సమస్య... నిలిచిపోతున్న వాహనాలు... పట్టించుకోని అధికారలంటూ.. వన్‌టౌన్ వాసులు గగ్గోలు పెడుతున్నా... అధికారుల తీరుతో నివ్వెరపోతున్నా... సమస్యకు మాత్రం పరిష్కారం లభించటం లేదు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఆటోవాలాలతో పలు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొంతమంది ఆకతాయిలు సైతం ఆటో డ్రైవర్లుగా మారి నడుపుతుండటంతో కొన్ని ప్రాంతాల్లో వివాదాలు సైతం చోటు చేసుకుంటున్నాయి. నడిరోడ్డుపై ఆటోలను ఆపేసి ఘర్షణలకు దిగుతున్న సంఘటనలు సైతం పాతబస్తీలో నిత్యం దర్శనమిస్తున్నాయి.

ప్రధాన కూడళ్లలో అడ్డంగా ఆటోలు....

ప్రధాన కూడళ్లలో ఆటోవాలాలు తమ వాహనాలను అడ్డదిడ్డంగా ఉంచి ప్రయాణికుల కోసం ఎదురు చూస్తున్నారు. కనీసం వెనుక ముందు కూడా చూడకుండా వాహనాల రాకపోకలను సైతం పట్టించుకోకుండా ఆటోలను నిలుపుతుండటంతో పరిస్థితులు దారుణంగా మారుతున్నాయి. కాళేశ్వర రావు మార్కెట్ బస్‌టెర్మినల్ నుంచి లోబ్రిడ్జిలోకి వచ్చే మలుపు వద్ద ఒకేసారి నాలుగైదు ఆటోలు ఒకదాని పక్కన ఒకటి రోడ్డుకు అడ్డంగా ఉంచి ప్రయాణికుల గురించి ఎదురు చూస్తున్నారు. అలాగే లోబ్రిడ్జి దిగువన ఉన్న మెట్లు వద్ద సైతం అడ్డంగా ఆటోలు ఉంచి ప్రయాణీకులను పిలుస్తున్నారు. వాటితో వెనుక నుంచి వేగంగా వస్తున్న వాహనాలు ఒక్కసారిగా వీటిని ఢీకొట్టి ప్రమాదాల బారిన పడుతున్నాయి. ఒకవేళ ఎవరైన ఆటోను రాసుకొని వెళ్లితే అక్కడ ఆటోవాలాలు వీరంగం వేసి రోడ్డుపై గందరగోళాలను సృష్టిస్తున్నారు. ఇటువంటి సంఘటనలు నిత్యకృత్యంగా మారాయి.

గద్దబొమ్మ సెంటర్‌లో మరింత దారుణం....

గద్దబొమ్మ సెంటర్‌కు సమీపంలో లోబ్రిడ్జి నుంచి మార్కెట్ వైపు వచ్చే క్రమంలోనూ ఆటోవాలాలతో ప్రయాణికులు అల్లాడుతున్నారు. ఫ్లెక్లైవర్ దిగువన కెనాల్ ఒడ్డున వరుసగా ఆటోలు పెట్టడంతో లోబ్రిడ్జి నుంచి కళాక్షేత్రం వరకూ ట్రాఫిక్ నిలిచిపోతుంది. వందలాది వాహనాలు నిలిచిపోయినా ఆటోలను అలాగే రోడ్డుకు అడ్డంగా పది పదేహను ఆటోలను ఉంచి ప్రయాణికులను పిలుస్తుంటారు. పోలీసులు అక్కడే ఉన్నా వారి వైపు ఏమాత్రం పట్టించుకోవటం లేదంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా వినాయకునిగుడి నుంచి మార్కెట్ వైపు వచ్చే మార్గంలోనూ ఆటోలు అడ్డంకిగా మారుతుండటంతో పరిస్థితి రోజు రోజుకు దిగజారుతుంది.

పోలీసులు దృష్టి పెట్టాలి...

పోలీసు అధికారులు ప్రతి రోజూ వందలాది ద్విచక్ర వాహనాలను తనిఖీలు చేసి జరిమానాలను విధిస్తున్నారు. అయితే ట్రాఫిక్ సమస్యలను సృష్టిస్తున్న ఆటోలపై దృష్టి పెట్టడం లేదంటూ స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు. నగరంతో పాటుగా చుట్టుపక్కల గ్రామాల నుంచి సైతం వచ్చిన ఆటోలు రోడ్డుకు అడ్డంకిగా పెడుతుండటంతో పాతబస్తీలోని పలు ప్రాంతాల్లో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వీటిపై అధికారులు దృష్టి పెట్టి ట్రాఫిక్ సమస్యలను నివారించాలని వన్‌టౌన్ వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఏడాది పాలనలో ఏం చేశారో చెప్పాలి



స్కానర్ ఆవిష్కరించిన మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు

మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సుపరిపాలన పేరుతో ప్రజల వద్దకు వెళుతున్న కూటమి నేతలు ముందుగా ప్రజలకు ఏం చేశారో చెప్పాలని మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు నిలదీశారు. భవానీపురం 40వ డివిజన్ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో కార్పొరేటర్ యరడ్ల ఆంజనేయ రెడ్డి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ చంద్రబాబు మేనిఫెస్టో ను గుర్తుకు తెస్తూ 40వ డివిజన్ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు, క్లస్టర్ అధ్యక్షుడు కేసరి కృష్ణా రెడ్డి, కార్పొరేటర్లు షేక్ ఇర్ఫాన్, బాపతి కోటిరెడ్డి, శిరంశెట్టి పూర్ణ చంద్రరావు పాల్గొని వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. చంద్రబాబు మోసాలను, ప్రజలకు ఇచ్చిన బాండ్లు, వైఎస్ జగన్ ప్రెస్ మీట్‌ను ప్రదర్శించారు. ఇంటింటికి వెళ్లి ప్రజలతో క్యూ ఆర్ కోడ్ ను స్కాన్ చేసి కూటమి మోసాలను వివరించాలని కోరుతూ క్యూ ఆర్ కోడ్ ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి వెలంపల్లి మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం ఏడాది కాలంగా మాటలకే పరిమితమైందని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నింటిని గాలికి వదిలేసిందని ధ్వజమెత్తారు. గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందాయా లేదా అని అడిగి తెలుసుకునేవారన్నారు. పథకాలు రాని వారి వివరాలు సేకరించి వారి సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేవారని చెప్పారు. కూటమి మాత్రం వైఎస్ జగన్ కంటే ఎక్కువ పథకాలు ఇస్తామని మోసపూరిత హామీలతో ప్రజలను నమ్మించారన్నారు. సూపర్ సిక్స్ పథకాలలో ఎంత లబ్ధి చేకూరుతుందో వివరిస్తూ బాండ్లు పంపిణీ చేశారన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే పథకాలన్నీ అమలు చేస్తామని ష్యూరిటీ ఇచ్చారన్నారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ సంతకాలతో దొంగపత్రాలు ఇచ్చారని గుర్తు చేశారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హయాంలో కోవిడ్ లాంటి క్లిష్ట సమయంలో కూడా ఏ పథకం ఆపకుండా అమలు చేశారన్నారు. కానీ కూటమి ప్రభుత్వం అమ్మఒడిని అమలు చేయకుండా ఒక సంవత్సరం ఎగ్గొట్టిందన్నారు. హిందూపురం నుంచి ఇచ్ఛాపురం వరకు ఉచితంగా బస్సులో ప్రయాణించవచ్చని చెప్పారని, అది నేటికి అమలు కాలేదని పేర్కొన్నారు. పైగా షరతులు వర్తిస్తాయంటున్నారన్నారు. దీనికి కూడా వాయిదాలపై వాయిదాలు వేస్తున్నారన్నారు. ఒక్క పెన్షన్ తప్ప కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఏ ఒక్కటి అమలు చేయలేదన్నారు. తల్లికి వందనం ఎవరికీ వచ్చిందో ఎవరికీ రాలేదో తెలియడం లేదన్నారు. తల్లికి వందనం అర కొరగా ఇచ్చి చేతులు దులుపుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు చంద్రబాబు ఇచ్చిన బాండ్లు, మేనిఫెస్టోలో మోసపూరిత వాగ్దానాల గురించి వివరించాలని, ప్రజలకు హామీలు గుర్తుచేయాలని, పథకాలు వచ్చాయా లేదా అని అడగాలన్నారు. సుపరిపాలన పేరుతో కూటమి నేతలు ప్రజలవద్దకు వచ్చినప్పుడు చంద్రబాబు ఇచ్చిన హామీలను, బాండ్లను చూపించి ప్రశ్నించే విధంగా ప్రజలలో చైతన్యం తీసుకురావాలని పార్టీ నేతలకు సూచించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, వైఎస్సార్ అభిమానులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రభుత్వ అసమర్థతను ప్రజలకు వివరించాలి

వైఎస్సార్ సీపీ పశ్చిమ ఇన్‌చార్జి వెలంపల్లి



ముదిగొండ ప్రకాష్‌ను సత్కరిస్తున్న వెలంపల్లి శ్రీనివాసరావు తదితరులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వైఎస్సార్ సీపీ నూతన పదవులు పొందిన నేతలు ప్రభుత్వ అసమర్థతను మరింతగా ప్రజలకు వివరించాలని ఆ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు తెలిపారు. ఉమ్మడి కృష్ణా జిల్లా వైఎస్సార్ సీపీ ఎస్సీ విభాగాల ఇన్‌ఛార్జిగా నియమితులైన ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముదిగొండ ప్రకాష్ వెలంపల్లి శ్రీనివాసరావును ఆయన కార్యాలయంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వెలంపల్లి ప్రకాష్‌ను సత్కరించి అభినందించారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఎలా మోసం చేస్తున్నది ప్రజలకు వివరించాలని సూచించారు. పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఎస్సీ విభాగ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శిరంశెట్టి పూర్ణచంద్రరావు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పోలిమెట్ల శరత్, నాయకులు నెలకుర్తి రమేష్, బోడా ప్రేమ్‌కుమార్, గంజి షన్ముక్, థామస్, ప్రకాష్, గంపల నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

25 నుంచి నూతన యాగశాలలో హోమాలు



నూతన యాగశాల

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): 25వ తేదీ శ్రావణ మాసం తొలి శుక్రవారం నుంచి అమ్మవారి సన్నిధిలో నూతనంగా నిర్మించిన యాగశాలలో హోమాలు నిర్వహించేందుకు వైదిక కమిటీ నిర్ణయించింది. శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలోని రాధాకృష్ణ విగ్రహాలు వద్ద సుమారు రూ. 5 కోట్ల వ్యయంతో దాత సంగా నరసింహరావు నూతన యాగశాలను నిర్మించారు. శ్రావణ మాసం కల్లా నూతన యాగశాల అందుబాటులోకి తీసుకురావాలని ఈవో శీనానాయక్ ఇటీవల ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించడంతో యాగశాల పరిసరాల్లో మిగిలిన పనులను వేగంగా పూర్తి చేశారు. పనులు పూర్తి కావడంతో శుక్రవారం నుంచి యాగశాలలో చండీ హోమం, గణపతి హోమం, నవ గ్రహ శాంతి హోమాలు నిర్వహించనున్నారు. అమావాస్య, పౌర్ణమి, ఇతర విశేషమైన రోజుల్లో హోమాలు జరిపించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారి సన్నిధికి చేరుకుంటారు. దీంతో భక్తుల ఇబ్బందులను పరిగణలోకి తీసుకున్న దేవస్థానం ఆలయ ప్రాంగణంలో నూతన యాగశాల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. నూతన యాగశాల నిర్మాణానికి దాత సంగా నరసింహరావు ముందకు రావడంతో పూర్తి వ్యయాన్ని ఆయనే భరించి పనులను జరిపించారు. ఎట్టకేలకు భక్తులకు నూతన యాగశాల అందుబాటులోకి రావడంతో ఇబ్బందులు తొలగిపోయాయి.

జోరు వానలోనూ దుర్గమ్మ సన్నిధికి..

- ఇంద్రకీలాద్రికి తరలివచ్చిన భక్త బృందాలు
- దుర్గమ్మకు ఆషాఢ సారె సమర్పణ
- నేటితో ముగియనున్న ఆషాఢ మాసోత్సవాలు



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



సారె సమర్పించేందుకు తరలివచ్చిన భక్త బృందాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఆషాఢ మాసోత్సవాల నేపథ్యంలో బుధవారం పెద్ద ఎత్తున భక్తులు దుర్గమ్మకు సారెను సమర్పించారు. తెల్లవారుజాము నుంచి వర్షం కురుస్తున్నా లెక్క చేయకుండా భక్త బృందాలు ఇంద్రకీలాద్రికి కుటుంబ సమేతంగా తరలివచ్చి అమ్మవారికి సారెను సమర్పించాయి. సారె సమర్పించేందుకు తరలివచ్చిన భక్త బృందాలతో ఆలయ ప్రాంగణంలో పండుగ వాతావరణం కనిపించింది. మహామండపం లిఫ్టు, మెట్ల మార్గం ద్వారా కొండపైకి చేరుకున్న భక్తులు అమ్మవారి మూలవిరాట్‌ను దర్శించుకున అనంతరం మహా మండపం ఆరో అంతస్తులో ఉత్సవ మూర్తికి సారెను సమర్పించారు. ఆషాఢం ముగింపుతో బుధవారం పెద్ద ఎత్తున భక్తులు కుటుంబ సమేతంగా ఇంద్రకీలాద్రికి తరలివచ్చారు. మధ్యాహ్నం నుంచి వర్షం కాస్త తెరిపి ఇవ్వడంతో సారె సమర్పించే భక్తుల తాకిడి పెరిగింది.

ఘాట్‌రోడ్డు మూసివేత

ఎడతెరిపి లేకుండా వర్షం కురియడంతో దుర్గగుడి ఘాట్‌రోడ్డును మూసివేశారు. ఘాట్‌రోడ్డు మీదగా ఎటువంటి రాకపోకలను అనుమతించలేదు. దేవస్థాన బస్సులను కనకదుర్గనగర్ వైపు మళ్లించగా, భక్తులను మహా మండపం లిఫ్టు, మెట్ల మార్గం ద్వారా అనుమతించారు. సాయంత్రం వరకు ఇదే పరిస్థితి నెలకొంది.

నేటితో ఆషాఢ మాసోత్సవాల ముగింపు...

దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో జరుగుతున్న ఆషాఢ మాసోత్సవాలు గురువారంతో ముగియనున్నాయి. దేవస్థాన అర్చకులు, వైదిక కమిటీ, వేద పండితులు గురువారం అమ్మవారికి సారె సమర్పించనున్నారు. గురువారం సాయంత్రం వరకు భక్తులు అమ్మవారికి సారెను సమర్పించవచ్చునని, మహా మండపం ఆరో అంతస్తులో భక్తుల పూజలందుకుంటున్న ఉత్సవ మూర్తి ప్రధాన ఆలయానికి చేరుకుంటుందని అధికారులు పేర్కొన్నారు.

గుండెపోటు.. మొదటి గంటే కీలకం

- ఛాతీలో నొప్పిని నిర్లక్ష్యం చేయరాదు
- డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీ వీసీ డాక్టర్ పి.చంద్రశేఖర్



మాట్లాడుతున్న హెల్త్ యూనివర్శిటీ వీసీ డాక్టర్ పి.చంద్రశేఖర్, పక్కన డాక్టర్ శ్రీనివాస చౌదరి

లబ్బీపేట(విజయవాడతూర్పు):గుండెపోటుతో ఆకస్మికంగా మరణిస్తున్న వారిని ఇటీవల చూస్తున్నామని, గుండెపోటు వచ్చినప్పుడు మొదటి గంట ఎంతో కీలకమని డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వ విద్యాలయం వైస్ చాన్సలర్, కార్డియాలజిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు డాక్టర్ పి.చంద్రశేఖర్ అన్నారు. ఛాతిలో నొప్పి వచ్చిన వెంటనే అరగంటలో ఆసుపత్రికి వచ్చి, థ్రోంబోలైటిథెరపీ చేయించుకుంటే ప్రాణాపాయం నుంచి బయటపడే అవకాశం ఉందన్నారు. కార్డియాలజీ సొసైటీ ఆఫ్ ఇండియా ఆంధ్ర ప్రదేశ్ చాప్టర్ ఆధ్వర్యంలో ఈ నెల 18 నుంచి 20 వరకూ మంగళగిరిలోని ఎన్ఆర్ఐ వైద్య కళాశాలలో కార్డియాలజిస్టుల సదస్సు నిర్వహించారు. ఆ సదస్సు విజయవంతమైన సందర్భంగా బుధవారం ఆయుష్ ఆస్పత్రిలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డాక్టర్ పి.చంద్రశేఖర్ మాట్లాడుతూ ఛాతిలో నొప్పి వచ్చిన అరగంటలో ఆస్పత్రికి వస్తే థ్రోంబోలైటిథెరపీ చేస్తారన్నారు. గంటన్నర లోపు ఆస్పత్రికి వెళితే ఎమర్జెన్సీ ప్రైమరీ యాంజియోప్లాస్టీ నిర్వహిస్తారని చెప్పారు. ఆయుష్ ఆసుపత్రి డైరెక్టర్, సదస్సు ఆర్గనైజింగ్ సెక్రటరీ పీఎస్ శ్రీనివాస చౌదరి మాట్లాడుతూ ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజీలో జరిగిన కాన్ఫరెన్స్ లో 400 మంది కార్డియాలజిస్టులు పాల్గొన్నట్లు వెల్లడించారు. అంతేకాక 68 శాస్త్రీయ సెషన్ల ద్వారా 62 మంది ప్రఖ్యాత ప్రతినిధులు, అమెరికా ఇతర దేశాల నుంచి వచ్చిన 9 మంది అంతర్జాతీయ ప్రతినిధులు పాల్గొన్నట్లు వివరించారు. ఈ కాన్ఫరెన్స్ కార్డియాలజీ, క్లినికల్ ప్రాక్టీస్, గుండె సంబంధిత వైద్య రంగంలో జరుగుతున్న తాజా అభివృద్ధిపై అవగాహనకు ఒక ఉత్తమ వేదికగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో పలువురు వైద్యులు పాల్గొన్నారు.

మూడు షిఫ్ట్‌లలో విధులు నిర్వర్తించాలి



వర్షం వల్ల దెబ్బతిన్న రోడ్లను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): వర్షాకాలంలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించటానికి వీఎంసీ ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల్లో విధులు నిర్వర్తిస్తున్న ఎమినిటీ, శానిటరీ, ప్లానింగ్ సెక్రటరీలతో ఏర్పాటుచేసిన మాన్సూన్ రెస్పాన్స్ టీం మూడు షిఫ్ట్‌లలో పనిచేయాలని కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. ప్రకాశం బ్యారేజ్, రథం సెంటర్, బందర్ రోడ్, బెంజ్ సర్కిల్, బెంజ్ సర్కిల్ నుంచి రామవరప్పాడు నేషనల్ హైవే సర్వీస్ రోడ్ ప్రాంతాల్లో బుధవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మాన్సూన్ రెస్పాన్స్ టీంకు కేటాయించిన పాయింట్లలో ఉదయం 6 గంటల నుంచి మూడు షిఫ్ట్‌లలో విధులు నిర్వహించాలని ఆదేశించారు. వర్షం వచ్చినా రాకపోయినా కచ్చితంగా మాన్సూన్ రెస్పాన్స్ టీం తమ తమ పాయింట్లలో ఉండాలని సూచించారు. వర్షం వచ్చిన వెంటనే పది నిమిషాల్లో రోడ్డుపైన నీటి నిల్వలు ఉండకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. నీటి నిల్వలు తీసేందుకు అవసరమైన పరికరాలు ముందుగానే సమకూర్చుకోవాలని స్పష్టం చేశారు. ఈ టీంలను ఆయా విభాగాల అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తుండాలని కోరారు. చీఫ్ ఇంజినీర్, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్, చీఫ్ సిటీ ప్లానర్ ముగ్గురు సమన్వయంతో మాన్సూన్ రెస్పాన్స్ టీం సమర్ధవంతంగా పనిచేయాలని తెలిపారు. చీఫ్ ఇంజినీర్ ఆర్. శ్రీనాథ్ రెడ్డి నోడల్ ఆఫీసర్‌గా వ్యవహరించాలని సూచించారు. జోనల్ కమిషనర్ కె. షమ్మీ, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాల్ కృష్ణ నాయక్ పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో బీఎంఎస్ ఆవిర్భావ దినోత్సవం

లబ్బీపేట(విజయవాడతూర్పు):భారతీయ మజ్దూర్ సంఘ్ 71వ ఆవిర్భావ దినోత్సవం బుధవారం ప్రభుత్వాస్పత్రిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి ప్రధాన గేటు ఎదుట ఆ సంఘ పతాకాన్ని శ్రీనివాసరెడ్డి (వాసు) ఆవిష్కరించి మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్మికులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం బీఎంఎస్ నిరంతరం కృషి చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు ప్రసాద్, విజయబాబు, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

పీడిత ప్రజల ఆశాజ్యోతి అచ్యుతానందన్



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):స్వాతంత్ర సమరయోధులు, కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత కేరళ మాజీ ముఖ్యమంత్రి వీఎస్ అచ్యుతానందన్ తన జీవిత చరమాంకం వరకూ పీడిత ప్రజల అభ్యున్నతికి అండగా నిలిచారని సీపీఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్‌సిహెచ్ శ్రీనివాసరావు అన్నారు. సీపీఎం పశ్చిమ నగర కమిటీ ఆధ్వర్యంలో నెహ్రూ బొమ్మ సెంటర్‌లో అచ్యుతానందన్ సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు అచ్చుతానందన్ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ భూస్వాములకు, నిరంకుశ పాలకులకు వ్యతిరేకంగా సామాన్యుల గొంతు వినిపిస్తూ లెక్కలేని పోరాటాలకు నాయకత్వం వహించారని కొనియాడారు.

నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న నవధీర్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):విద్యార్థులు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకున్నప్పుడే అనుకున్న లక్ష్యాలను సాధించగలరని హిందూస్థాన్ యూనిలీవర్ కంపెనీ సేల్స్ డైరెక్టర్ నవధీర్ చిట్టా అన్నారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జున రావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో ఆ కళాశాల ప్రాంగణంలో ప్లేస్‌మెంట్ అవకాశాలు– నైపుణ్యాలు అంశంపై బుధవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నవధీర్ మాట్లాడుతూ విద్యార్థులు మారుతున్న కాలానుగుణంగా తమతమ రంగాల్లోని అంశాలపై పట్టు సాధించాలని సూచించారు. సాంకేతిక రంగాలపైనా నైపుణ్యాతలను పెంపొందించుకోవాలని చెప్పారు. ప్రస్తుత మార్కెట్ ధోరణలను గమనంలో ఉంచుకొని ముందుకు అడుగులు వేయాలని ఆ దిశగా తమ ప్రణాళికలను రూపొందించుకోవాలని పేర్కొన్నారు. అలాగే కార్పొరేట్ రంగంలో ఉన్న పోటీతత్వాన్ని తట్టుకునే విధంగా తమలోని ప్రతిభాపాటవాలకు ఎప్పటికప్పుడు పదును పెడుతూ ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి చిట్టా అమర్‌సుధీర్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ శరణకుమార్, ఎంబీఏ విభాగాధిపతి శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు.

విపత్తులపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న డాక్టర్ డి. చంద్రశేఖర్

పటమట(విజయవాడతూర్పు): విపత్తులు సంభవించిన సమయంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని వీఎంసీ అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) డాక్టర్ డి. చంద్రశేఖర్ తెలిపారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని నూతన భవనంలో ఉన్న సమావేశపు హాల్లో విపత్తుల నిర్వహణపై వీఎంసీ పట్టణ ప్రణాళిక విభాగం చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్న కుమార్‌తో కలిసి ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విపత్తు ఎన్ని విధాలుగా రావచ్చు, రాకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలి, ఎదుర్కొన్న తర్వాత తీసుకునే చర్యలు వంటి అంశాలపై సిబ్బందికి సూచనలు చేశారు. ఇతర రాష్ట్రలు, దేశాల్లో విపత్తు నిర్వహణ ఎలా జరుగుతుంది, ఆ పద్ధతులు ఏ విధంగా మనకు అమలు చేయొచ్చు వంటి విషయాలపై చర్చించారు. విజయవాడ నగరపాలక సంస్థ గత ఏడాది తీవ్రమైన విపత్తును ఎదుర్కొందని, విపత్తు ఎప్పుడొస్తుంది ఎలాంటి పరిస్థితుల వల్ల వస్తుంది అన్న అంశాలు మనం చెప్పలేమని, కానీ విపత్తు ఎలా వచ్చినా వీఎంసీ పరిధిలో విపత్తు సమయంలో పునరావస కేంద్రాలు ఎక్కడున్నాయో, వాటి కోసం ఎవరిని సంప్రదించాలి వారికి సహాయానికి వచ్చే బృందాల నంబర్లు, అన్ని విషయాలు విపత్తు సంభవించే ప్రాంతాలకు తెలిపరిచినట్లు వెల్లడించారు. తద్వారా ప్రజలు ఎటువంటి పరిస్థితుల్లోనైనా సరే వారిని వారు కాపాడుకునే చర్యలు కచ్చితంగా తీసుకునే అవకాశం ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమం లో విజయవాడ నగరపాలక సంస్థ చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, వీఎంసీ డెప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ చంద్రశేఖర్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎ.ఉమామహేశ్వరరావు, రోడ్ ట్రాన్స్‌పోర్టు ఇన్‌చార్జి ఆఫీసర్ ఆర్. ప్రవీణ్, అసిస్టెంట్ మేనేజర్ స్రవంతి, డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎంవీవీ రామకృష్ణ, ప్రోగ్రాం ఆఫీసర్ ధనుంజయ్ రావు, వీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.